సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
19వ వసంతంలోకి..
www.suryaepaper.com
EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
మంగళవారం
17-02-2026
పేజీలు: 02

# త్వరలో 120 కిలోమీటర్ల వేగంతో మెట్రో రైలు

మీరట్ మెట్రోను త్వరలో ప్రారంభించనున్నారు. దేశంలోనే అత్యంత వేగంగా ప్రయాణించే మెట్రో మార్గంగా దీన్ని రూపొందించారు. ఇక మీరట్ నుంచి ఢిల్లీకి కేవలం 55 నిమిషాల్లోనే ప్రయాణించవచ్చు. ఫాస్టెస్ట్ మెట్రో సర్వీస్‌గా రూపుదిద్దుకుంటున్నట్లు మీరట్ మెట్రో కారిడార్‌లో రైలు గంటకు సుమారు 120 కిలోమీటర్ల వేగంతో వెళ్లనున్నది. 21 కిలోమీటర్ల ఆ కారిడార్‌ను ఫిబ్రవరి 22వ తేదీన ప్రధాని మోదీ ఓపెన్ చేయనున్నారు. మీరట్ సౌత్ నుంచి మోదీపురం వరకు ఆ రైలు వెళ్తుంది. ఈ మార్గంలో మొత్తం 12 స్టేషన్లు ఉన్నాయి. కేవలం 30 నిమిషాల్లోనే ఈ దూరాన్ని కవర్ చేయనున్నారు. సెమీ హై స్పీడ్ నమో భారత్ రైళ్లకు ఏర్పాటు చేసే ట్రాక్స్‌ను మీరట్ మెట్రోకు ఏర్పాటు చేశారు. ఆధునిక స్టెయిన్‌లెస్ స్టీల్‌తో రూపొందించిన ట్రెయిన్ సెట్స్ ఆ మెట్రోలో ఉండనున్నాయి. లైట్‌వెయిట్ డిజైన్‌తో కోచ్‌లను తయారు చేశారు. ఫ్లోరోసెంట్ గ్రీన్, బ్లూ, ఆరెంజ్ కలర్స్‌లో బోగీలు ఉండనున్నాయి. ఆటోమెటిక్ ట్రెయిన్ ప్రొటెక్షన్ టెక్నాలజీ .. కొత్త మెట్రో రైళ్లను తయారు చేశారు. మీరట్ మెట్రో మార్గంలో ప్రతి రైలులో ఏసీ ఉంటుంది. సుమారు 700 మంది ప్రయాణికులు వెళ్లే రీతిలో డిజైన్ చేశారు. 173 మంది వరకు కూర్చోవచ్చు. లగేజీ ర్యాక్‌లు, యూఎస్బీ చార్జింగ్ పోర్టులు ఉన్నాయి. మహిళలు, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల కోటా కూడా ఉంది. ప్రధాని మోదీ మీరట్ మెట్రో మార్గాన్ని ఓపెన్ చేయనున్నారు. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ లైన్‌లో మెట్రో వేగం గంటకు 110 కిలోమీటర్లుగా ఉన్నది.






## కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి, పవన్ కల్యాణ్, జగన్ పుట్టిన రోజు శుభాకాంక్షలు

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు కేసీఆర్‌కు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిలు కూడా కేసీఆర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. "తెలంగాణ మాజీ సీఎం కే చంద్రశేఖర రావుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు. నిండా నూరేళ్లు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటున్నాను" అని జగన్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. కేసీఆర్ సుదీర్ఘకాలంగా ప్రజా జీవితంలో ఉన్నారని, రాష్ట్రానికి మరింత సేవ చేసే శక్తిని ఆయనకు దేవుడు ప్రసాదించాలని కోరుకుంటున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.




## ఆకట్టుకుంటున్న సేయోన్ ఫస్ట్ గ్లింప్స్

కోలీవుడ్ సెన్సేషనల్ స్టార్ శివకార్తికేయన్ తన 26వ సినిమా అప్‌డేట్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. గతేడాది 'అమరన్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న శివకార్తికేయన్-కమల్ హాసన్ కాంబో, ఇప్పుడు 'సేయోన్' అనే పవర్‌ఫుల్ ప్రాజెక్ట్‌తో మళ్ళీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఫిబ్రవరి 16న ఈ చిత్ర టైటిల్‌తో ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన మేకర్స్ తాజాగా ఫస్ట్ గ్లింప్స్‌ను వదిలారు. ఫస్ట్ గ్లింప్స్‌లో శివకార్తికేయన్ సాంప్రదాయ ధోతీ, విభూతి మరియు రుద్రాక్షలతో కనిపిస్తూనే, చేతిలో కాగడా పట్టుకుని ఊగిపోతున్నట్లు కనిపిస్తున్నాడు. శివకార్తికేయన్ పాత్ర చూస్తుంటే.. ఈ సినిమా తమిళ దేవుడు మురుగన్ (సుబ్రహ్మణ్య స్వామి) అంశతో ముడిపడి ఉన్నట్లు తెలుస్తోంది. 'సేయోన్' అంటే రాజు అని అర్థం. మురుగన్‌ని తమిళంలో 'సేయోన్' అని కూడా పిలుస్తారు. లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత బ్యానర్ 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్'పై ఆర్. మహేంద్రన్ తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'అమరన్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరు కలిసి చేస్తున్న రెండో సినిమా కావడంతో ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన మొదటి చిత్రం 'తాయ్ కిళవి' విడుదలకు ముందే శివకార్తికేయన్ ఆయన ప్రతిభను గుర్తించి ఈ భారీ అవకాశం ఇచ్చినట్లు సమాచారం.

## బీజేపీ నేత వ్యాఖ్యలపై నటి త్రిష రియాక్షన్



తమిళనాడు బీజేపీ చీఫ్ నైనార్ నాగేంద్రన్ ఇటీవలే నటుడు విజయ్ దళపతిపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. విజయ్ టీవీకే (తమిళగ వెట్రి కళగం) పార్టీ పెట్టిన నేపథ్యంలో ఆయనపై నాగేంద్రన్ తీవ్ర విమర్శలు చేశారు. విజయ్ కు రాజకీయ అనుభవం లేదని, ముందు తన ఇంటి నుంచి.. ముఖ్యంగా త్రిష ఇంటి నుంచి బయటకు రావాలని చర్చనీయాంశ వ్యాఖ్యలు చేశారు. దీనిపై హీరోయిన్ త్రిష తీవ్రంగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా తన లాయర్ ద్వారా ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఒక ఉన్నత రాజకీయ స్థానంలో ఉన్న వ్యక్తి నుంచి ఇలాంటి మాటలు ఊహించలేదన్నారు. తమిళనాడు బీజేపీ చీఫ్ నైనార్ నాగేంద్రన్ ఇటీవలే నటుడు విజయ్ దళపతిపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. విజయ్ టీవీకే (తమిళగ వెట్రి కళగం) పార్టీ పెట్టిన నేపథ్యంలో ఆయనపై నాగేంద్రన్ తీవ్ర విమర్శలు చేశారు. విజయ్ కు రాజకీయ అనుభవం లేదని, ముందు తన ఇంటి నుంచి.. ముఖ్యంగా త్రిష ఇంటి నుంచి బయటకు రావాలని చర్చనీయాంశ వ్యాఖ్యలు చేశారు. దీనిపై హీరోయిన్ త్రిష తీవ్రంగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా తన లాయర్ ద్వారా ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఒక ఉన్నత రాజకీయ స్థానంలో ఉన్న వ్యక్తి నుంచి ఇలాంటి మాటలు ఊహించలేదన్నారు.

# సినీ నటి ప్రత్యూష మృతి కేసులో తీర్పు

## సిద్ధార్థరెడ్డి లొంగిపోవాలంటూ సుప్రీంకోర్టు ఆదేశం



ప్రముఖ టాలీవుడ్ సినీ నటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు తుది తీర్పును వెలువరించింది. రెండు దశాబ్దాలకు పైగా నడుస్తున్న ఈ కేసులో జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం కీలక తీర్పును వెలువరించింది. సిద్ధార్థరెడ్డి పిటిషన్‌ను కొట్టివేస్తూ, నాలుగు వారాల్లో లొంగిపోవాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. సినీ నటి ప్రత్యూష 2002 ఫిబ్రవరి 23న మృతి చెందారు. ఈ కేసులో నిందితుడు సిద్ధార్థరెడ్డికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సిద్ధార్థరెడ్డి హైకోర్టులో సవాల్ చేయడంతో జైలు శిక్షను రెండేళ్లకు కుదించింది. హైకోర్టు తీర్పును ప్రత్యూష తల్లి సరోజిని సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. మరోవైపు, శిక్షను రద్దు చేయాలని సిద్ధార్థరెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ కేసులో సుప్రీంకోర్టు ఇరువైపుల వాదనలు విన్నది. గత ఏడాది నవంబర్‌లో విచారణ పూర్తి చేసిన సుప్రీంకోర్టు, తీర్పును రిజర్వ్ చేసింది. ఈ కేసుకు సంబంధించి 24 ఏళ్ల తర్వాత ఈరోజు తీర్పును వెలువరిస్తూ, సిద్ధార్థరెడ్డిని లొంగిపోవాలని ఆదేశించింది. 2002లో తాను, ప్రత్యూష పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించామని, తాను ఆసుపత్రిలో చికిత్స పొందడంతో ప్రాణాలతో బయటపడ్డానని సిద్ధార్థరెడ్డి చెబుతున్నారు. తన కూతురు ఆత్మహత్యకు సిద్ధార్థరెడ్డి కారణమని సరోజిని ఆరోపించారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అమెరికా క్రికెట్ జట్టు



టీ20 వరల్డ్ కప్ కోసం వచ్చిన అమెరికా క్రికెట్ జట్టు సభ్యులు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. జట్టులోని భారత సంతతి ప్లేయర్లు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెప్టెన్ మోనాంక్ పటేల్ మాట్లాడుతూ, "స్వామివారి దర్శనం చాలా బాగా జరిగింది. ఆలయ ప్రాంగణం, పరిసరాలు అత్యంత పరిశుభ్రంగా ఉన్నాయి. ఈ అవకాశం కల్పించిన ఐసీసీ, బీసీసీఐ, ఏపీ క్రికెట్ అసోసియేషన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు. అమెరికా జట్టులో తెలుగు కుర్రాడు సాయితేజ కూడా ఉన్నాడు. ఆయన తండ్రి నాగేశ్వర్ రెడ్డి నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం కమలాపురి గ్రామానికి చెందినవారు. ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడటంతో సాయితేజ అక్కడే పుట్టి పెరిగాడు. జట్టులో ఢిల్లీకి చెందిన మిలింద్ కుమార్, మహారాష్ట్రకు చెందిన శుభమ్ రంజా, గుజరాత్‌కు చెందిన మోనాంక్ పటేల్ (కెప్టెన్), ముంబైకి చెందిన హర్మీత్ సింగ్, సౌరభ్ నేత్రావల్కర్, కర్ణాటక మూలాలున్న సంజయ్ కృష్ణమూర్తి ఉన్నారు. మరోవైపు, తిరుమలలో నేడు భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. 13 కంపార్టుమెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. టీటీడీ తెలిపిన వివరాల ప్రకారం... టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. దివ్యదర్శనం, సర్వదర్శనం టోకెన్లు ఉన్నవారికి 3 నుంచి 5 గంటల సమయం పడుతోంది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 నుంచి 3 గంటల సమయం పడుతోందని అధికారులు తెలిపారు. నిన్న 73,776 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,291 మంది తలనీలాల మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి హుండీ ఆదాయం రూ.4.42 కోట్లు వచ్చింది.

# ఢిల్లీ హైకోర్టులో ఇళయరాజాకు ఎదురుదెబ్బ

ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా స్వరాలు దశాబ్దాలుగా సినీ ప్రపంచాన్ని, అభిమానులను ఉర్రూతలూగిస్తున్నాయి. ఆయన సొంత పాటలపై హక్కుల కోసం జరుగుతున్న చట్టపరమైన పోరు ఇప్పుడు కీలక మలుపు తీసుకుంది. ఢిల్లీ హైకోర్టు తాజాగా ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు ఇళయరాజాకు ప్రతికూలంగా మారాయి. 1976 నుంచి 2001 మధ్య కాలంలో ఇళయరాజా సంగీతం అందించిన 134 సినిమాల ఆడియో హక్కులు ప్రముఖ ఆడియో సంస్థ 'సరిగమ'కే చెందుతాయని కోర్టు స్పష్టం చేసింది. నాటి చిత్ర నిర్మాతలు ఈ హక్కులను శాశ్వతంగా సరిగమకు అమ్మేశారని, కాపీరైట్ చట్టం ప్రకారం ఇళయరాజాకు యాజమాన్య హక్కులు లేవని జస్టిస్ తుషార్ రావు గెడేలా తీర్పు ఇచ్చారు. ఈ వివాదం 'ఎప్ ఇనియా పొన్ నిలవే' వంటి ఆల్‌టైమ్ హిట్ సాంగ్‌తో మొదలైంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు ఇళయరాజా అనుమతులు ఇవ్వగా సరిగమ సవాల్ చేసింది. "నిర్మాత వద్ద వేతనం తీసుకుని కంపోజ్ చేసిన పాటలపై హక్కులు నిర్మాతకే చెందుతాయి. ఈ క్రమంలో ఆ హక్కులు సరిగమకు బదిలీ అయ్యాయి" అని కోర్టు స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పుపై అప్పీల్ చేసే అవకాశాన్ని ఇళయరాజాకు కోర్టు కల్పించింది.






## 13 వందల అడుగుల ఎత్తుకు ఎగసిపడ్డ లావా

ప్రపంచంలోనే అత్యంత క్రియాశీలక అగ్నిపర్వతాల్లో ఒకటిగా పేరుగాంచిన 'కిలోవా' మరోసారి విస్ఫోటనం చెందింది. ఆదివారం తెల్లవారుజామున ప్రారంభమైన ఈ విస్ఫోటనం పది గంటల పాటు కొనసాగింది. హవాయి ద్వీపకల్పంలోని ఈ అగ్నిపర్వతం 2024 డిసెంబర్ నుంచి వరుస విరామాలతో లావా విరజిమ్ముతోంది. దాదాపు 2,80,000 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ అగ్నిపర్వతం, 1952 నుండి ఇప్పటివరకు డజన్ల కొద్దీ సార్లు బద్దలై తన ఉనికిని చాటుకుంటూనే ఉంది. యూఎస్ జియోలాజికల్ సర్వే (యూఎస్ జీఎస్) నివేదిక ప్రకారం, ఈ విస్ఫోటనం దాదాపు 10 గంటల పాటు కొనసాగింది. అగ్నిపర్వత ముఖద్వారం నుండి ఎర్రగా మండుతున్న లావా ఫౌంటైన్లు ఏకంగా 1,300 అడుగుల (సుమారు 400 మీటర్లు) ఎత్తు వరకు ఆకాశంలోకి ఎగసిపడ్డాయి. ఈ అద్భుత దృశ్యాలు సమీపంలోని కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి.



## చైతన్యపురిలో నరబలి కలకలం!

హైదరాబాద్‌లోని చైతన్యపురి ప్రాంతంలో నరబలి వార్త కలకలం రేపింది. చైతన్యపురిలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న వైశ్యరాజు జ్యువెలర్స్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ముత్తయ్య అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం తీవ్ర సంచలనంగా మారింది. ముత్తయ్య కొంతకాలంగా జ్యువెలరీ షాపులో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అయితే అతడి మృతదేహం షాప్ పరిసరాల్లో కనిపించడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. షాప్ ప్రారంభోత్సవానికి ముందు నరబలి ఇచ్చారనే అనుమానాలు వ్యక్తం చేశారు. ముత్తయ్యను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అసలు ఇది ఆత్మహత్యా? లేక హత్యా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. ఈ సంఘటనతో చైతన్యపురి ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

### బిల్ గేట్స్ లేకుండానే ఏఐ సదస్సు..
# కీలక నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం




దేశ రాజధాని ఢిల్లీలో కృత్రిమ మేధాపై శిఖరాగ్ర సదస్సు జరుగుతున్నది. ప్రపంచ దేశాలకు చెందిన ఏఐ నిపుణులు ఆ సమ్మిట్‌లో పాల్గొంటున్నారు. అయితే మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ మాత్రం ఆహ్వానం అందలేదని తెలిసింది. వాస్తవానికి బిల్ గేట్స్ ప్రస్తుతం ఇండియాలోనే టూరు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఆయన ఏపీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కానీ ఇటీవల అమెరికాతో పాటు అనేక దేశాలను కుదిపేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్ నేపథ్యంలో బిల్ గేట్స్‌కు ఆహ్వానం అందించలేదని తెలుస్తోంది. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బిల్ గేట్స్ పేరు ఉన్న నేపథ్యంలో ఆయన ఆహ్వానంపై పునరాలోచ చేశామని, గేట్స్‌కు ఆహ్వానం పంపవద్దు అన్న నిర్ణయానికి వచ్చినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. బాధితుల పక్షాన నిలబడాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓ మీడియా కథనం ద్వారా తెలిసింది.ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు హాజరవుతున్న ముఖ్యమైన స్పీకర్లలో బిల్ గేట్స్ పేరు లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. అమెరికా ఫైనాన్షియర్, చైల్డ్ సెక్స్ నేరస్తుడైన జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు చెందిన కొన్ని క్లాసిఫైడ్ డాక్యుమెంట్లను ఇటీవల అమెరికా ప్రభుత్వం రిలీజ్ చేసింది. ఆ ఫైల్స్‌లో బిల్ గేట్స్ కూడా ఉన్నట్లు తెలిసింది. బిల్ గేట్స్‌కు వివాహేతర సంబంధాలు ఉన్నట్లు ఎప్‌స్టీన్ ఆరోపించాడు. రష్యన్ అమ్మాయిలతో రిలేషన్ ఉన్నట్లు ఆ ఫైల్స్‌లో ఉన్నది. బిల్ గేట్స్ ఒక్కడే కాదు.. ప్రపంచదేశాలకు చెందిన నేతలు, వ్యాపారవేత్తలు, సెలబ్రిటీలు ఎప్‌స్టీన్ ఉచ్చులో చిక్కుకున్నారు. అయితే 2019లో న్యూయార్క్ జైలులో చనిపోయిన విషయం తెలిసిందే. ఇక తన తప్పును గ్రహించిన బిల్ గేట్స్ ఇటీవల ఓ మీడియాతో మాట్లాడుతూ క్షమాపణలు చెప్పారు. ఎప్‌స్టీన్‌తో గడిపిన ప్రతి నిమిషాన్ని బాధగా వర్ణించారు. ఆ ఘటనల పట్ల క్షమాపణలు కోరుతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పురి పేరు కూడా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉన్న విషయం తెలిసిందే.

### తెలంగాణ భవన్‌లో
# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు




తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు మంగళవారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్, యువ నాయకులు తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అతిథులుగా హాజరయ్యారు. కేసీఆర్ 72 వ జన్మదినాన్ని పురస్కరించుకుని 72 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, తెలంగాణ ఉద్యమం నేపథ్యంతో రూపొందించిన పాటలు, డాక్యుమెంటరీ ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తన ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి గా కేసీఆర్‌చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. కేసీఆర్ 72 వ జన్మదినాన్ని పురస్కరించుకుని 72 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, తెలంగాణ ఉద్యమం నేపథ్యంతో రూపొందించిన పాటలు, డాక్యుమెంటరీ ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తన ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి గా కేసీఆర్‌చరిత్రలో నిలిచిపోతారని అన్నారు.మూడేళ్ళ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుధీర్ రెడ్డి, తెలంగాణ భవన్ ఇంచార్జి రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమ కారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చిరంజీవి భుజానికి సర్జరీ




మెగాస్టార్ చిరంజీవి ఎడమ చేతికి సపోర్ట్ బెల్ట్ ను చూసి ఫ్యాన్స్ రకరకాల అనుమానాలు వ్యక్తం చేశారు. చిరంజీవికి ఏమైందంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో.. తాజాగా మెగాస్టార్ స్పందించారు. ఈ మేరకు ప్రత్యేక ట్వీట్ చేశారు. 'చాలా మంది సన్నిహితులు నా చేతికి బెల్ట్ చూసి ఏమైందని ఆరా తీశారు. నా భుజానికి మైనర్ కీ హోల్ సర్జరీ జరిగింది. ఆల్రెడీ కోలుకుంటున్నాను. నా రొటీన్ లైఫ్ కు వచ్చేశాను. ఈ సందర్భంగా డాక్టర్ నితిన్ కు స్పెషల్ థాంక్స్ చెప్పాలి. ఆయన ప్రముఖ ఆంథ్రోస్కోపీ సర్జన్. ఆయన కేరింగ్, స్మూత్ ట్రీట్ మెంట్ వల్ల త్వరగా కోలుకుంటున్నాను. మీ అందరి ప్రేమకు ప్రత్యేక ధన్యవాదాలు' అంటూ ట్వీట్ చేశారు చిరంజీవి.

### దేశవ్యాప్తంగా రైతులందరికీ
# మరో శుభవార్త



దేశంలోని రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ఇప్పటికే అమలు చేస్తోన్న విషయం తెలిసిందే. రైతులను ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు వారికి తోడ్పాటు అందిస్తోంది. అనేక కార్యక్రమాలను రైతన్నల కోసం ప్రవేశపెడుతోంది. ఈ క్రమంలో రైతులకు ప్రయోజనం చేకూర్చేలా కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. వారి కోసం ఓ ప్రత్యేక డిజిటల్ ఫ్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది. మంగళవారం జైపూర్‌లో జరిగిన ఓ సమావేశంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ డిజిటల్ ఫ్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. దీని ద్వారా రైతులు తమకు అవసరమైన సమగ్ర సమాచారం తెలుసుకోవచ్చు. దేశంలో రైతులందరికీ సేవలు అందించేందుకు భారత్ విస్తార్ పేరుతో కేంద్రం ఈ డిజిటల్ సేవలను లాంచ్ చేసింది. ఈ సేవల ద్వారా రైతులు ఒకే కాల్‌తో ఏ సమాచారాన్ని అయినా తెలుసుకోవచ్చు. పంట ఆధారిత శాస్త్రీయ సలహాలు, ధరల వివరాలు, వాతావరణ సమాచారం తెలుసుకోవచ్చు. డిజిటల్ ఇండియా దార్శనికతను గ్రామీణ ప్రాంతాలను విస్తరంచడంలో ఈ చొరవ ఉపయోగపడనుందని కేంద్రం తన ప్రకటనలో తెలిపింది. రైతుల ఆదాయాన్ని పెంచడానికి, వ్యవసాయమే కాకుండా పశు పోషణ దిశగా రైతులను ముందుకు నడిపించడానికి ఈ ప్రయత్నం ఉపయోగప డనుంది. రైతులు ఈ సేవలను ఉపయో గించుకోవా లని, దీని ద్వారా లబ్ది పొందా లని సూచించింది. రైతులు తమ సొంత భాషలోనే ఈ ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఫ్లాట్ ఫామ్‌పై సేవలు పొందవచ్చు. ఈ సందర్భంగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. వ్యవసాయంలో డిజిటల్ విప్లవాన్ని తీసుకురావడంలో ఇదొక చారిత్రాత్మక అడుగుగా అభివర్ణించారు. రైతులు తమకు అవసరమైన సేవలు అన్నీ పొందటంలో ఇది సహాయపడుతుందన్నారు. రైతులు తమకు అవసరమైన ప్రతీ సమాచారాన్ని ఇందులో తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. జైపూర్ లోని దుర్గాపురలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్‌లో జరిగిన కార్యక్ర మంలో ఈ డిజిటల్ ఫ్లాట్‌ఫామ్ లాంచ్ చేశారు.



## అర్ధరాత్రి ఇళ్లల్లోకి చేరిన వరద..
## మణికొండలో పగిలిన భారీ పైప్ లైన్

హైదరాబాద్ లోని మణికొండలో అర్ధరాత్రి భారీ పైప్ లైన్ పగిలింది. సింగూరు నుంచి హైదరాబాద్‌కు తాగునీటిని తీసుకువచ్చే పైప్ లైన్ పగిలి భారీ ఎత్తున వరద నీరు చుట్టుపక్కల అపార్ట్ మెంట్లను ముంచెత్తింది. ఎంప్లాయిస్ కాలనీ, శివసాయి కాలనీల్లోని సెల్లార్లలోకి వరద చేరడంతో కార్లు, ద్విచక్ర వాహనాలు మునిగిపోయాయి. వరద ముంచెత్తడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమీపంలోనే పందెన్ వాగు ఉండడంతో వరద నీరు అందులోకి చేరింది. లేదంటే మరికొన్ని కాలనీల్లోకి వరద చేరేదని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. మున్సిపల్ అధికారులతో పాటు పోలీసులు, అగ్నిమాపక, హైడ్రా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. పైప్ లైన్ పగలడంతో రోడ్డు ధ్వంసం కాగా వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

## భర్తను కత్తితో పొడిచి హత్య చేసిన భార్య

భర్తలను భార్యలు చంపడం ఇప్పుడు ట్రెండ్ గా మారింది. ఇలాంటి మర్డర్లు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తను ఓ భార్య అతికిరాతకంగా కత్తితో పొడిచి హత్య చేసింది. ఈ దారుణ ఘటన మంచిర్యాల జిల్లా మందమర్రిలో చోటు చేసుకుంది. పట్టణంలోని శాంతినగర్ కు చెందిన మోయిన్, అవంతి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. సాఫీగా సాగుతున్న వీరి దాంపత్య జీవితంలో గొడవలు చెలరేగాయి. ఈ క్రమంలో ఇవాళ (మంగళవారం) మరోసారి గొడవ జరగడంతో తీవ్ర ఆవేశానికి గురయిన అవంతి ఇంట్లో ఉన్న కత్తితో భర్త మోయిన్ పై దాడి చేసింది. రక్తపు మడుగుల్లో ఉన్న మోయిన్ ను గ్రామస్తులు గుర్తించి ఆస్పత్రికి తరలించగా తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందాడు.



## నేడు ముంబై, రేపు ఢిల్లీకి!

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఒకవైపు పరిపాలన, మరోవైపు రాజకీయ సమావేశాలతో బిజీబిజీగా గడుపుతున్నారు. వరుస షెడ్యూల్స్‌తో బిజీగా ఉన్నా ఆయన నేడు ముంబై, రేపు ఢిల్లీ పర్యటనలకు వెళ్లనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో మున్సిపల్ శాఖపై కీలక సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం రాత్రికి శంషాబాద్ విమానాశ్రయం నుంచి ముంబై పయనం కానున్నారు. రేపు ముంబైలో ప్రతిష్టాత్మకంగా జరగనున్న 'క్లైమేట్ వీక్' కార్యక్రమంలో పాల్గొని, అనంతరం సాయంత్రం అక్కడి నుంచి నేరుగా దేశ రాజధాని ఢిల్లీకి చేరుకుంటారు. ఎల్లుండి కేంద్ర ప్రభుత్వం నిర్వహించే అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.



# చాలా బాధగా ఉంది

తన పేరుతో ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న AI మార్ఫింగ్ చిత్రాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా రూపొందించబడిన ఈ నకిలీ ఫోటోలు తనను మానసికంగా బాధిస్తున్నాయని కీర్తి తెలిపింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది.ఇక కీర్తి సురేష్ ఆవేదనకు మద్దతుగా నటి ఆండ్రియా జెరెమియా కూడా AI వల్ల కలిగే నష్టాల గురించి మాట్లాడారు. నటులకే కాదు, సామాన్య ప్రజలకు కూడా AI సమస్యగా మారుతోంది. AI మన కోసం పనిచేయాలి, అంతేకానీ మనల్ని ఇబ్బంది పెట్టకూడదు అని ఆమె అభిప్రాయపడ్డారు. రష్మిక మందన్న, సమంత వంటి పలువురు నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ లేదా మార్ఫింగ్ చిత్రాల బారిన పడ్డారు. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా దీనిపై గళం విప్పడం, AI దుర్వినియోగంపై మరింత కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

## మొహాలీ స్కూళ్లు, ఫోర్టిస్ ఆస్పత్రికి బాంబు బెదిరింపులు



పంజాబ్‌లోని మొహాలీలో ఉన్న కొన్ని స్కూళ్లు, ఆస్పత్రులకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఫోర్టిస్ ఆస్పత్రికి కూడా బెదిరింపు వచ్చినట్లు తెలిసింది. దీంతో పోలీసులు సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. ఫోర్టిస్ ఆస్పత్రిలో ప్రస్తుతం అత్యవసర విభాగం మాత్రమే పనిచేస్తున్నట్లు అధికారులు చెప్పారు. నగరంలోని అన్ని స్కూళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఫోర్టిస్ ఆస్పత్రిలో సీఎం భగవంత్ మాన్ సోమవారం చికిత్స కోసం చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడ భద్రతను పెంచారు. హెల్త్ ఫెసిలిటీ నుంచి డిశ్చార్జ్ అయిన కొన్ని గంటల్లోనే మళ్లీ ఆయన ఆస్పత్రిలో చేరారు. బుధవారం మొహాలీలోని 16 స్కూళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో స్కూళ్ల నుంచి విద్యార్థుల్ని తరలించారు. అయితే ఎటువంటి అనుమానాస్పద పేలుడు పదార్థాలు లభించలేదు. ఇటీవల చండీఘడ్, అమృత్‌సర్, జలంధర్, పాటియాలా, హర్యానా స్కూళ్లకు కూడా బెదిరింపులు వచ్చాయి.